క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్కౌట్, గైడ్ శిబిరాల్లో విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని వ్యాగన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయంలో స్కౌట్, గైడ్ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులు మానవత్వం, సహనం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం నుంచి మచిలీపట్నం, కాకినాడ నుంచి తెనాలి వరకు 14 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 200 మంది స్కౌట్, గైడ్స్ పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి ప్రథమ చికిత్స, ఫైర్ సేఫ్టీ, మంటలేని వంట, కంపాస్, నాటింగ్ అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. క్యాంపు లీడర్ రమేష్‌బాబు, ఎల్‌వోసీ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



పెనమలూరు: గోసాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు గోసాల వద్ద ఈ నెల 5వ తేదీన గుర్తు తెలిని వ్యక్తి మద్యం సేవించి హిందీలో మాట్లాడుతూ అల్లరి చేయసాగాడు. అతడ్ని స్థానికులు వెళ్లిపోవాలని చెప్పగా అతను కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లి రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి వెళ్లడంతో అతడ్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 108 వాహనం ద్వారా చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రామారావు కోరారు.

పెనమలూరులో కలశ యాత్ర



పెనమలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం కలశ యాత్ర నిర్వహించారు. కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ, విజయవాడ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నామట్టి–నాదేశం కలశ యాత్ర మండల స్థాయిలో నిర్వహించారు. గ్రామాల నుంచి సేకరించిన మట్టి ఒకే కలశంలో కలిపి ఆ కలశాన్నియాత్రగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, ఏఓ లోయ శివశంకర్‌రావు, సర్పంచ్‌లు లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఎంఈఓ కనకమహాలక్ష్మి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బీమాల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటికే వైద్య సేవలు



ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ముంగిటికే వైద్య సేవలు అందుతున్నాయని ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కలవపాముల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి ప్రారంభించారు. ఈ శిబిరాన్ని ఆర్డీఓ విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ స్టాళ్ల పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, వైద్యులు దీప, రాకేష్‌అనిల్, శివరామకృష్ణ, శ్వేత, నాగ వజ్రకుమార్, అమరేశ్వరి పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను మార్చిలోగా అందజేస్తాం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరు 10, 11 వార్డుల్లో డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: టిడ్కో ఇళ్లను మార్చి లోగా లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలో 10, 11 వార్డుల్లో రూ.35 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి టిడ్కో గృహాలను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. పనులు పురోగతి, లబ్ధిదారులకు అన్ని వసతులతో ఇళ్లు అందించే విషయమై టిడ్కో అధికారులు, మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలోని జెమిని స్కూల్, ఎగినపాడు, గండిగుంట గ్రామాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేయడంతో లబ్ధిదారులకు అందకుండా పోయాయన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో ఉయ్యూరు, గండిగుంట ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాల్లోనే టిడ్కో ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. గడప గడపకు వెళ్లినప్పుడు టిడ్కో ఇళ్ల సమస్యను తీసుకొచ్చారన్నారు. సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.15 కోట్లు కేటాయించారన్నారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబరు, జనవరి నాటికి వెయ్యి మందికి తొలి విడతగా గృహాలను అందిస్తామన్నారు. మార్చి నెలాఖరు నాటికి లబ్ధిదారులందరికీ అన్ని వసతులతో కూడిన ఇళ్లు కేటాయించి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, తెనాలి పద్మావతి, ఊర శ్రీవాణి, కూరాడ వెంకటలక్ష్మి, ఎండీ బేగ్, రాజులపాటి చిన్ని, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు రాజులపాటి రామచంద్రరావు, వెంట్రప్రగడ బాబ్జీ, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, దిరిశం జ్యోతిర్మయి పాల్గొన్నారు.



ఉయ్యూరులో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దసరా ఉత్సవాలకు సంబంధించి ఉయ్యూరు శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పార్థసారథి ఆవిష్కరించారు.

సమరోత్సవ సభ





విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు పెనమలూరు, గన్నవరం ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, వల్లభనేని వంశీమోహన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ హాజరయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అన్నివర్గాలకు జగనన్న సురక్ష వైద్య సేవలు



కానూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రకాశరావు



మాదలవారిగూడెం వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీప్రసన్న

కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. కానూరులోని 4వ సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అన్నివర్గాల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 వైద్య శిబిరాలకు గాను ఇప్పటివరకు ఏడు వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. మిగితా వైద్య శిబిరాలు కూడా సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజలందరూ ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ సరిపల్లి కమలాభాయి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం తోట వెంకటనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాదలవారిగూడెంలో..

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచ్ బుద్ధాల లక్ష్మీ ప్రసన్న, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు పిన్నిబోయిన గోపి శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శివ ప్రసాద్, సిబ్బంది వైద్య సేవలందించారు. ఎంపీడీఓ సత్యకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

389 మంది రోగులకు వైద్య పరీక్షలు

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 389 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం సర్పంచ్ చెన్నుబోయిన శివ నాగేంద్రమ్మ ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ సుందర్‌కుమార్, డాక్టర్ చంద్రిక, డాక్టర్ నిఖిత, డాక్టర్ ప్రిస్కిల్లా, డాక్టర్ దినేష్, ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి షాహిద్‌బాబు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఈఓ బి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత చెన్నుబోయిన సుబ్బారావు పాల్గొన్నారు.



కంకిపాడు మండలం వేల్పూరులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు



నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్లో మందులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు ఈడుపుగల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు–2 సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిపుణులైన వైద్యులు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫారెస్ట్ భూములను పరిశీలించిన కలెక్టర్



అంబాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం పరిశీలించారు. గత 30 సంవత్సరాలుగా కొత్తూరు రిజర్వుడ్ ఫారెస్ట్‌కు చెందిన అంబాపురం గ్రామంలో కొండ ప్రాంతాన్ని ఆక్రమించుకుని నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇంటి పట్టాలను మంజూరు చేసేందుకు ఆ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలసి పరిశీలించారు. రిజర్వుడ్ ఫారెస్ట్ భూములను ఇళ్ల స్థలాలుగా మార్పు చేయాలంటే ఎంత భూమిని అయితే ఇళ్ల స్థలాలుగా ఇవ్వనున్నారో అంతే రెవెన్యూ భూమిని రిజర్వుడ్ ఫారెస్ట్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. గతంలో పాతపాడు గ్రామంలోని భూమిని రిజర్వుడ్ ఫారెస్ట్‌కు బదిలీ చేసి, అంబాపురం గ్రామంలో రిజర్వుడ్ భూమిని ఇళ్ల పట్టాలుగా ఇవ్వడానికి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తాగునీటి సమస్య, మరికొన్ని సమస్యలను సర్పంచ్ గండికోట సీతయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌తో పాటు రూరల్ తహసీల్దార్ జాహ్నవి, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు



మురుగు కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది



గ్రామంలో దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: గ్రామంలో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుండటంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి జి.రామ్మోహనరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతంలో సైడు డ్రెయిన్లను పూడికతీయించి, దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పౌరుదలకు నోచుకోని డ్రెయిన్లను గుర్తించి పూడికతీయించినట్లు తెలిపారు. అంతర్గత రహదారుల్లోని చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బందిచే తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగునిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లించినట్లు వివరించారు. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి అనారోగ్య సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు చేయించి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌ల ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

చెత్త సమస్య పరిష్కారం దిశగా చర్యలు

గన్నవరం: గన్నవరంలో అనధికార డంపింగ్ యార్డు సమస్య పరిష్కరానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా భారీగా పేరుకుపోయిన చెత్తను తరలించేందుకుగాను టెండర్లను పిలిచారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సన్నద్ధమవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. గన్నవరం పంచాయతీ పరిధిలో సుమారు 30 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. గ్రామ పరిధిలో రోజూ సుమారు మూడు నుంచి నాలుగు టన్నుల చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్నారు. గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు లేకపోవడంతో సేకరించిన చెత్తను స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా డంప్ చేస్తున్నారు. చెత్త నిల్వలు భారీగా పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త

ఎమ్మెల్యే చొరవతో..

ప్రజల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ డంపింగ్ యార్డు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల డీపీఓ నాగేశ్వరనాయక్‌తో కలిసి చెత్త నిల్వలను పరిశీలించడంతో పాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని గొల్లనపల్లి శివారులో గుర్తించిన ప్రైవేట్ స్థలంలో చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు చెత్త తరలింపు నిమిత్తం పంచాయతీ అధికారులు టెండర్లు పిలిచారు. చెత్తను త్వరితగతిన బయటకు తరలించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సన్నహాలు చేస్తున్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యే సూచనలు మేరకు గ్రామాన్ని చెత్త రహితంగా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

కేంద్ర మాజీ మంత్రి కావూరి ఆత్మీయ సమావేశం



డాక్టర్ దుట్టా నివాసంలో పాత మిత్రులతో కావూరి సాంబశివరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కుల,మతాల కల్మషం లేకుండా విలువలతో కూడిన రాజకీయ అనుచరులను కలిగి ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు నివాసానికి సోమవారం ఆయన విచ్చేశారు. దుట్టా నివాసంలో ఆనాటి తన అనుచరులతో కావూరి ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 19వ తేదీన విజయవాడలో కావూరి అనుచరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని చెప్పారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్, మాజీ వైస్ ఎంపీపీ గాంధీ, మాజీ వార్డు సభ్యుడు నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బాలాజీ, సూర్యనారాయణ, నరసింహారావు, సతీష్, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

రూ.13 లక్షలతో గ్రావెల్ రోడ్డు



రోడ్డు నిర్మించక ముందు



గ్రావెల్ రోడ్డు వేసిన తర్వాత

విజయవాడరూరల్: నున్న గ్రామంలో విజయవాడ నగర పాలక సంస్థకు చెందిన జగనన్న లేఅవుట్‌కు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక అనేక అవస్థలు పడాల్సి వచ్చేది. ఆ లేఅవుట్లో సుమారు నాలుగు వేల ఇళ్ల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. ప్రభుత్వమే ఫేజ్–3 లో గృహాలను నిర్మించేందుకు కాంట్రాక్టు ఇవ్వడంతో పనులు సజావుగా సాగేందుకు రోడ్డు మార్గం లేక సిమెంటు, ఐరన్, ఇసుక, కంకర లాంటివి లేఅవుట్ లోకి లారీలు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వచ్చేది. వర్షాలు కురిసినప్పుడైతే మరింత కష్టంగా ఉండేది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నున్న గ్రామంలోని పోలవరం కాల్వ నుంచి లేఅవుట్ లోనికి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షలను మంజూరు చేసిందని గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీరు బీఎస్ రవికాంత్ తెలిపారు. ప్రస్తుతం గ్రావెల్ రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదు. సూరంపల్లి గ్రామంలోని జగనన్న లేవుటుకు రోడ్డు నిర్మించేందుకు కూడా ప్రభుత్వం రూ.19లక్షల ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

ఇళ్ల కేసులో నలుగురు అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జేఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్లు మంజూరు చేయిస్తామని ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన కేసులో కొత్తపేట పోలీసులు నలుగురిని సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట, చిట్టినగర్, కేదారేశ్వరపేట, కంసాలిపేటతో పాటు పశ్చిమ నియోజక వర్గంలో పలువురికి జేఎన్ఎన్‌యుఆర్ఎం కింద నిర్మించిన ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పి కేదారేశ్వరపేటకు చెందిన షేక్.హబీబ్, జక్కంపూడి కాలనీకి చెందిన షేక్. లాల్ అహ్మద్, నిమ్మల అన్నపూర్ణ, పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్. మహ్మద్ హుస్సేన్‌లు పలువురి నుంచి ఒక్కొక్కరి వద్ద రెండు నుంచి మూడున్నర లక్షల వరకు వసూలు చేశారు. అయితే బాధితులకు ఇళ్లు ఇవ్వకపోవటంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు సోమవారం నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

15 నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: విశ్వమాతా చారిటబుల్ సంస్థ, కుర్తాళం సిద్ధేశ్వానంద పీఠం ఆధ్వర్యంలో 15వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.